క్లుప్తంగా

నేడు బ్రహ్మకుమారీస్ భవనం ప్రారంభం

సామర్లకోట: స్థానిక అంబటివారితోటలో ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విద్యాలయం నూతన భవనాన్ని సోమవారం ప్రారంభిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం స్థానిక శ్రీభీమేశ్వర జర్నలిస్టు అసోసియేషన్ భవనంలో వారు మాట్లాడుతూ 60 వసంతాల మహా తపస్వీని రాజయోగిని సంతోష్‌దీదీజీ నూతన భవనాన్ని ఉదయం ప్రారంభిస్తారని తెలిపారు.

సామర్లకోటలో నేడు 'స్పందన'

సామర్లకోట: జగనన్నకు చెబుదాం 'స్పందన' కార్యక్రమాన్ని సోమవారం సామర్లకోటలో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఎస్ఎల్‌వీ కుమారి, మున్సిపల్ కమిషనర్ జె.రామారావు తెలిపారు. స్థానిక గాంధీచౌక్‌లోని రైతు భవనంలో ఈ కార్యక్రమం ఉంటుందని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

రైల్వే స్టేషన్‌లో స్టాల్స్ తనిఖీ



సామర్లకోట రైల్వే స్టేషన్‌లోని స్టాల్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సామర్లకోట: స్థానిక రైల్వే స్టేషన్‌లో స్వచ్ఛ ఆహార్ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ప్లాట్‌ఫారాలపై ఉన్న స్టాల్స్, ఐఆర్‌టీసీ ఫుడ్ స్టాల్స్‌ను అధికారులు తనిఖీ చేశారు. స్వచ్ఛ భారత్ పక్షోత్సవాల్లో భాగంగా నాణ్యతతో కూడిన ఆహార పదార్థాలు అందించే విధంగా స్టేషన్ మేనేజర్ రమేష్, చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ కిశోర్ పర్యవేక్షణలో ఈ తనిఖీలు జరిగాయి. స్టాల్స్‌లో ప్రతి వస్తువు విక్రయాలకు సంబంధించి బోర్డులు ఏర్పాటు చేసే విధంగా ఆదేశాలు జారీ చేశారు. అనంతరం రికార్డులను తనిఖీ చేశారు. స్టాల్స్‌లో పనిచేసే సిబ్బంది తప్పనిసరిగా యూనిఫారంతో పాటు ఐడీ కార్డులను కలిగి ఉండాలన్నారు. లేకుంటే అపరాధ రుసుం వసూలు చేస్తామని హెచ్చరించారు.

వైభవంగా భువనేశ్వరీ మాత జన్మదినోత్సవం




ప్రత్యేక అలంకరణలో భువనేశ్వరి అమ్మవారు

పెద్దాపురం: నిత్య జీవితంలో పరిపూర్ణమైన శాంతిని కోరుకునే భువనేశ్వరీ మాత జన్మదిన వేడుకలను రెండో రోజు ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్థానిక వర్జులవారి వీధిలో వేంచేసిన భువనేశ్వరీ అమ్మవారి పీఠానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక అభిషేకాలు, హోమాలు, పూజలు చేశారు. అమ్మవారి పీఠాధిపతులు లక్ష్మీ లలిత జ్యోతిష పంచాంగకర్త చింత గోపిశర్మ సిద్ధాంతి మాట్లాడుతూ పద్నాలుగు భువనాల్లోని చరాచర జీవరాశులన్నీ భువనేశ్వరీ మాత ఆధీనంలో ఉంటాయన్నారు. అనంతరం పలువురు దంపతులు పీటలపై ఆశీనులై గోపిశర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

ఇంటికి మహాలక్ష్మి అమ్మాయే

కాకినాడ రూరల్: అమ్మాయి పుడితే ఇంటికి మహాలక్ష్మి వచ్చినట్టేనని న్యాయవాది కొమ్మూరి శ్రీనివాసరావు అన్నారు. అంతర్జాతీయ కుమార్తెల దినోత్సవాన్ని రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. ఎక్కువ మంది ఆడపిల్లలను కని పెంచి పోషించిన తల్లులను ఘనంగా సత్కరించి దుస్తులు అందజేశారు. ఈ సందర్భంగా న్యాయవాది శ్రీనివాసరావు మాట్లాడుతూ కుటుంబంలో ప్రేమ, ఆనందానికి మూలం కుమార్తెలు అని అన్నారు. జేఎన్‌టీయూకే ప్రొఫెసర్ ఆలపాటి శ్రీనివాస్, డాక్టర్ సువర్ణరాజు, డాక్టర్ వెంకటరమణ, అడబాల రత్నప్రసాద్, చింతపల్లి సుబ్బారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ లేబొరేటరీస్ సంఘ అధ్యక్షుడిగా వెంకట్



వెంకట్

కాకినాడ క్రైం: జిల్లా మెడికల్ లేబొరేటరీస్ అసోసియేషన్‌కు నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఆదివారం స్థానిక రామారావుపేటలో నిర్వహించిన కార్యవర్గ సమావేశంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడిగా బెస్ట్ లేబొరేటరీస్ అధినేత వెంకట్, కార్యదర్శిగా నాగేశ్వరరావు, కోశాధికారిగా వైడీ ప్రసాద్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు.

ఆపదలో ఆధారం 108

- ఒక్క కాల్ దూరంలో అంబులెన్స్
- మండలానికో వాహనం ఏర్పాటు
- అత్యవసర సేవలకు కేరాఫ్



అధునాతన సాంకేతిక సదుపాయాలు కలిగిన 108 వాహనం

సామర్లకోట: మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన 108 సంజీవని వాహనాలను గత ప్రభుత్వం నిర్వీర్యం చేసినా ఆయన తనయుడు, ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కొత్త రక్తం ఎక్కించి నవయవ్వనంగా తీర్చిదిద్ది ఆపదలో ఉన్నవారి ప్రాణాలను కాపాడుతున్నారు. మరింత ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రతి మండలానికి 108, 104 వాహనాలను అందించారు. ప్రతి వాహనంలో ఒక డ్రైవర్, ఒక టెక్నీషియన్ ఉండేలా ఏర్పాటు చేశారు. నియోజకవర్గం రైల్వే జంక్షన్ కూడలితో పాటు ఏడీబీ రోడ్డు ఉండడంతో తరచూ ప్రమాదాలు జరిగే అవకావం ఉంటుంది. కరోనా కాలంలో ఈ వాహనాల సేవ గురించి ఎంత చెప్పినా తక్కువే.

సిబ్బంది జీతాలు పెంచి భరోసా..

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాక ముందు వరకు అరకొర జీతాలతో పనిచేస్తున్న 108 వాహనాల సిబ్బందికి సీఎం జగన్ ఎంతో మేలు చేశారు. టెక్నీషియన్‌లకు రూ.20 వేల నుంచి రూ.30వేలు, పైలెట్‌లకు రూ.18వేల నుంచి రూ.28 వేలకు పెంచారు.

ప్రాణం విలువ తెలిసిన కుటుంబం



మహానేత కుటుంబానికి ప్రజల ప్రాణాల విలువ తెలుసు. అందువల్లే ఈ సేవలను ఆధునీకరించి ప్రమాద ఘటన స్థలం నుంచి ఫోన్ కాల్ వచ్చిన 15 నిమిషాల లోపే అక్కడికి చేరుకుని ప్రాణాపాయాల నుంచి, క్షతగాత్రులకు తక్షణ సాయం అందిస్తున్నారు.

– నందికట్ల మంగ, గృహిణి, జగనన్న కాలనీ, సామర్లకోట

108తో తగ్గిన మరణాలు



గత తెలుగుదేశం ప్రభుత్వంలో 108 వాహనాలపై నిర్లక్ష్యం ఉండేది. ప్రస్తుతం రోడ్డు ప్రమాదాలు జరిగిన వెంటనే 108 వాహనాలు రావడంతో మరణాల సంఖ్య తగ్గిపోయింది. వాహనంలోనే ఆక్సిజన్ అందిస్తున్నారు. క్షతగాత్రుడు, వారి బంధువులు కోరిన ఆస్పత్రికి తీసుకువెళ్లి ప్రాణాలు కాపాడుతున్నారు.

– పుట్టా బుజ్జిబాబు, రైతు, జి.మేడపాడు

అల.. ప్రగతి పథంలో..



నాడు: అమీనాబాద్‌లో రోడ్డు లేక ఇళ్ల మధ్య నిలిచిన మురుగు



నేడు: అమీనాబాద్‌లో వేసిన సీసీ రోడ్డు



వాకతిప్పలో రోడ్డు వేయక ముందు ఇళ్ల మధ్య నిలిచిపోయిన నీరు



ప్రస్తుతం వాకతిప్పలో వేస్తున్న సీసీ రోడ్డు

- గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు
- మట్టి రోడ్లకు మోక్షం
- కొత్తపల్లి మండలంలో రూ. 3.10 కోట్లతో పనులు

కొత్తపల్లి: గ్రామాలు ప్రగతి పథంలో దూసుకుపోతున్నాయి. మండల పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ గడపగడపకూ మన ప్రభుత్వం నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. దశాబ్దాల నాటి రోడ్లకు మోక్షం కలుగుతోంది. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగుతోంది. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా క్షేత్రస్థాయిలో ప్రజా సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ఒక్కో సచివాలయం పరిధిలో రూ.20 లక్షలతో.

కొత్తపల్లి మండలంలో రూ.3.10 కోట్ల నిధులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుటారు. ఒక్కో సచివాలయానికి రూ.20 లక్షల మేర కేటాయించారు. సుమారు 56 సీసీ రోడ్లకు రూ.1.80 కోట్లు, 38 సీసీ డ్రైన్లకు రూ.1.29 కోట్లు కేటాయించారు. ఆ నిధులతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ముఖ్యంగా మండలంలోని అమినాబాద్, ఉప్పాడ, వాకతిప్ప, కొత్తపల్లి, కొండెవరంతో పాటు పలు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీలకు మోక్షం లభించింది. అవసరమైన చోట్ల ప్రాధాన్యత క్రమంలో రోడ్లు, డ్రైన్లు నిర్మించడంపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది.

అభివృద్ధి, సంక్షేమానికి పెద్దపీట

ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమానికి పెద్ద పీట వేస్తోంది. దేశంలో ఎక్కడ లేని విధంగా గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు ప్రజల వద్దకు వెళ్లి సమస్యలు తెలుసుకుంటున్నారు. వాటిని వెంటనే పరిష్కరిస్తున్నారు. ఇంటికే పథకాలు అందడంతో ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కారే సుధ, ఎంపీపీ, కొత్తపల్లి మండలం

భైభై గణేశా..

- ఘనంగా వినాయక నిమజ్జనాలు
- ఆటపాటలతో సందడి చేసిన యువత



సాగర తీరంలో వినాయకుని నిమజ్జనం చేస్తున్న భక్తులు

కొత్తపల్లి: ఉప్పాడ సాగర తీరంలో ఆదివారం గణపతి నిమజ్జనాల సందడి నెలకొంది. సుమారు 150 విగ్రహాలను సాగరంలో నిమజ్జనం చేశారు. వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలను ఆచరించారు. ఉదయం నుంచి రాత్రి వరకూ నిమజ్జనోత్సవంతో సాగరతీరం కళకళలాడింది. గ్రామాల్లోని వినాయక విగ్రహాలను మేళతాళాలు, బాణాసంచా కాల్పులతో ఊరేగించి ఉప్పాడ సముద్రంలో నిమజ్జనం చేశారు. కొత్తపల్లితో పాటు పిఠాపురం, గొల్లప్రోలు, సామర్లకోట, కిర్లంపూడి తదితర మండలాల్లోని వివిధ గ్రామాల నుంచి వందలాది విగ్రహాలను ట్రాక్టర్లు, ఆటోలపై ఊరేగింపుగా ఉప్పాడ తీసుకొచ్చి సముద్రంలో నిమజ్జనం చేశారు. తీరంలో గణపతికి ప్రత్యేక హారతులు ఇచ్చి పూజలు చేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో కొత్తపల్లి ఎస్సై స్వామినాయుడు తన సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.



వినాయక నిమజ్జనంలో పాల్గొన్న యువత, మహిళలు



గణపతిని నిమజ్జనానికి తీసుకువెళుతున్న భక్తులు

చిన్నారులకు డ్రాయింగ్ పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న రైల్వే మేనేజర్ రమేష్

సామర్లకోట: స్థానికంగా రైల్వే ఉద్యోగుల పిల్లలకు ఆదివారం స్వచ్ఛభారత్‌పై డ్రాయింగ్ పోటీలను నిర్వహించారు. విజయవాడ రైల్వే మహిళా సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటైన పోటీలను స్థానిక స్టేషన్ మేనేజర్ ఎం.రమేష్ ప్రారంభించారు. చిన్నారులను వివిధ కేటగిరీలుగా విభజించి స్వచ్ఛభారత్‌పై డ్రాయింగ్ పోటీలు జరిపారు. కాకినాడ, పిఠాపురం, అన్నవరం, సామర్లకోట రైల్వే స్టేషన్లలో పని చేస్తున్న ఉద్యోగుల పిల్లలు ఈ పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అసిస్టెంట్ డివిజనల్ ఇంజినీర్ బి.శివప్రసాద్, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ జోగారావు, స్టేషన్ మాస్టర్ అనంతలక్ష్మి, రైల్వే మజ్దూర్ యూనియన్ కార్యదర్శి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో ప్రతిభ



రాబర్ట్‌రాజ్‌కు బహుమతి అందజేస్తున్న నిర్వాహకులు

సామర్లకోట: శ్రీకాకుళం జిల్లా రణస్థలంలో ఎస్ఈఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెంట్ వద్ద నిర్వహించిన చెస్ పోటీల్లో అండర్– 16 విభాగంలో సామర్లకోటకు చెందిన రేగుళ్ల రాబర్ట్‌రాజ్ రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతి సాధించాడు. సామర్లకోట ప్రభుత్వ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న రాబర్ట్‌రాజ్ చెస్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో మున్సిపల్ వైస్ చైర్మన్ ఊబా జాన్‌మోజెస్, ఎంపీపీ బొబ్బరాడ సత్తిబాబు, ఎంపీడీఓ డి.శ్రీలలిత, ఎంఈఓలు పి.పుల్లయ్య, వై.శివరామకృష్ణయ్య అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ చెస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీవీ శర్మ, కార్యదర్శి భీమారావు, కన్వీనర్ ఎం.కిషోర్‌లు విజేత రాబర్ట్‌రాజ్‌కు బహుమతి అందజేశారు.

జోరుగా జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే

తుని రూరల్: మండల పరిధిలోని గ్రామాల్లో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే ముమ్మరంగా జరుగుతోందని ఎంపీడీఓ పి.రవికుమార్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. ఈ నెల 30 నుంచి నవంబర్ ఒకటి వరకు గ్రామాల్లో జగన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు. ఆయా గ్రామాల్లో జరిగే కార్యక్రమాలకు 15 రోజుల ముందు నుంచి వలంటీర్లు యాప్‌లో సర్వే వివరాలను నమోదు చేస్తున్నట్టు తెలిపారు. అందుకు అనుగుణంగా వైద్యసేవలు, మందులను అందిస్తామన్నారు. చామవరం, డి.పోలవరం, టి.తిమ్మాపురం, హంసవరం, కుమ్మరిలోవ గ్రామాల్లోని సర్వే వివరాలను ఇప్పటికే యాప్‌లో నమోదు చేశారన్నారు. ప్రజలు జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేకు సహకరించాలని కోరారు.

సద్వినియోగం చేసుకోవాలి

శంఖవరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైఎస్సార్ సీపీ కాకినాడ జిల్లా ఉపాధ్యక్షుడు నరాల శ్రీను సూచించారు. మండలంలోని నెల్లిపూడి, కొంతంగి, వజ్రకూటం గ్రామాల్లో ఆదివారం జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి అనారోగ్యంతో బాధపడుతున్న వారి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా నరాల శ్రీను మాట్లాడుతూ ప్రతి గ్రామంలో వైద్య సిబ్బంది 15 రోజుల పాటు సర్వే చేసి ప్రతి కుటుంబానికి టోకెన్ ఇస్తారన్నారు. అనంతరం ప్రతి సచివాలయంలో వైద్య శిబిరం ఏర్పాటు చేసి రోగులకు వైద్యం అందిస్తారని వివరించారు.

ఏజెంట్ల ధర్నా విజయవంతానికి పిలుపు



ఏజెంట్ల సమావేశంలో మాట్లాడుతున్న అసోసియేషన్ నాయకులు

పెద్దాపురం: ఎల్ఐసీ పరిరక్షణ, ఏజెంట్ల సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 9న హైదరాబాద్‌లో జరిగే చలో జోనల్ కార్యాలయం ఏజెంట్ల ధర్నాను జయప్రదం చేయాలని ఎల్ఐసీ ఏజెంట్ల అసోసియేషన్ ఆఫ్ ఇండియా సౌత్ సెంట్రల్ జనరల్ సెక్రటరీ పీఎల్ నరసింహారావు పిలుపునిచ్చారు. స్థానిక వరహాలయ్యపేట యాసలపు సూర్యారావు భవనంలో ఆదివారం నిర్వహించిన రాజమండ్రి డివిజన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డివిజన్ ఏజెంట్ల అసోసియేషన్ అధ్యక్షుడు వై.విశ్వేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న విధానాలతో ఎల్ఐసీ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. తొలుత భీమవరం బ్రాంచ్‌కు చెందిన పీఆర్‌కే రాజును రాజమండ్రి కన్వీనర్‌గా ఎన్నుకున్నారు. అజెంట్లు టి.కోటేశ్వరరావు, రవిశంకర్, నాగిరెడ్డి, బి.వీరభద్రరరావు, కేఎస్ఎన్ మూర్తి పాల్గొన్నారు.

ఏపీజీఎన్ఏ ఎన్నికలకు సన్నాహాలు



ఏపీజీఎన్ఏ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా కార్యవర్గ సమావేశానికి హాజరైన నర్సులు

కాకినాడ క్రైం: ఆంధ్రప్రదేశ్ గవర్నమెంట్ నర్సెస్ అసోసియేషన్ (ఏపీజీఎన్ఏ) ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఎన్నికలకు సన్నాహాలు మొదలయ్యాయి. ఇందులో భాగంగా కాకినాడ జీజీహెచ్‌లోని కమ్యూనిటీ హాల్లో కార్యవర్గ సమావేశం జరిగింది. స్టాఫ్‌నర్సు ఎస్.శ్యామల విజయకుమారి, హెడ్ నర్సు మేరీ సుజాత అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ప్రతి నర్సు ఓటు నమోదు చేయించుకోవాలని తీర్మానించారు. అందుకు ఏడాదికి రూ.240 చొప్పున మూడేళ్లకు గాను రూ.720 మొత్తం చెల్లించి సంఘంలో ఓటు హక్కు పొందాలని సూచించారు. ఈ నెల 30వ తేదీకి ప్రతి నర్సు తమ ఓటు నమోదు చేయించుకుని రసీదు పొందాలన్నారు. నమోదు చేయించుకున్న ఓటర్ల గణాంకాలు రుసుములతో సహా రాష్ట్ర ఎన్నికల అధికారులకు సమర్పిస్తే జిల్లా ఎన్నికల అధికారి నియామకం జరుగుతుందన్నారు. ఏపీజీఎన్ఏ రాష్ట్ర, జిల్లా స్థాయి ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం కర్నూలు నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ జ్యోతి, గుంటూరు నర్సింగ్ కళాశాల ప్రొఫెసర్ ఆర్.పద్మావతిలను ఎన్నికల అధికారులుగా నియమించిందని శ్యామల తెలిపారు. మూడేళ్ల అనంతరం ప్రతిష్టాత్మకంగా జరుగనున్న ఎన్నికల కోసం అసోసియేషన్ సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

జిల్లా వైద్యాధికారి నరసింహనాయక్

కోటనందూరు: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ నరసింహనాయక్ సూచించారు. స్థానిక పీహెచ్‌సీని ఆదివారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీ పరిసరాలను పరిశీలించిన ఆయన రికార్డులను తనిఖీ చేశారు. ఆసుపత్రిలో ప్రసవాలు, ఓపీ, రోగులకు చేస్తున్న పరీక్షలు, కల్పిస్తున్న సౌకర్యాలు, సిబ్బంది పనితీరు తదితర అంశాలపై వైద్యాధికారి డాక్టర్ ఇందిరాప్రియదర్శినితో చర్చించారు. విధి నిర్వహణలో ప్రభుత్వ నిబంధనలు పాటించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం బిళ్లనందూరులో జరుగుతున్న 'జగనన్న ఆరోగ్య సురక్ష' సర్వేను పరిశీలించారు. ఆయన వెంట డీఎంఓ భాస్కర్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలి

రౌతులపూడి: మండలంలోని ములగపూడిలో చేపట్టిన పీహెచ్‌సీ నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కాకినాడ జిల్లా వైద్యాధికారి జె.నరసింహనాయక్ సూచించారు. మండలంలోని ములగపూడి, శృంగవరం గ్రామాల్లో జరుగుతున్న జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను ఆదివారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం ములగపూడిలో పీహెచ్‌సీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీలో మౌలిక సదుపాయలను మెరుగు పరిచి నిత్యం ప్రజలకు వైద్య సేవలు అందించాలని సిబ్బందికి సూచించారు. గ్రామాల్లో అంటువ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని శృంగవరంలో పర్యటించి కో లొకేటెడ్ పీహెచ్‌సీ ఏర్పాటుపై స్థానికులతో చర్చించారు. కార్యక్రమంలో వైద్యులు సౌజన్య, సరోజిని, మండల పరిషత్ కో ఆప్షన్ సభ్యులు సీహెచ్‌వీవీ సత్యనారాయణ, ఎ.సతీష్ కుమార్ పాల్గొన్నారు.

శంఖవరం: ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించాలని డీఎంహెచ్‌ఓ నరసింహనాయక్ సూచించారు. స్థానిక పీహెసీని ఆదివారం ఆయన పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేను వేగవంతం చేయాలన్నారు. ఆసుపత్రిలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది పర్యటించి దోమల నివారణ మందు పిచికారీ చేయించాలని సూచించారు. కార్యక్రమంలో డీఎంఓ భాస్కరరావు, వైద్యుడు శెట్టిబత్తుల రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే లక్ష్యం



పాత ఇసుకపల్లిలో కమ్యూనిటీ హాలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ తులసీకుమార్

కొత్తపల్లి: గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందని జెడ్పీటీసీ గుబ్బల తులసీకుమార్ అన్నారు. మండలంలోని పాత ఇసుకపల్లిలో జెడ్పీ నిధులు రూ.5 లక్షలతో చేపట్టే కమ్యూనిటీ భవన అభివృద్ధి పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మతాలు, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గత ప్రభుత్వాల పాలనలో సంక్షేమం కనుచూపు మేరలో లేదన్నారు. చంద్రబాబు తన 14 ఏళ్ల పాలనలో పేదలకు చేసిందేమీ లేదన్నారు. ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తున్న ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని కోరారు. పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి శిక్షణ దోహదం



పంచాయతీ కార్యదర్శులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్, ఫ్యాకల్టీ

సామర్లకోట: గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి పంచాయతీ కార్యదర్శులకు నిర్వహించిన శిక్షణ ఎంతగానో దోహదపడుతుందని విస్తరణ శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్, జెడ్పీ డిప్యూటీ సీఈఓ జె.వేణుగోపాల్ అన్నారు. కాకినాడ జిల్లాలోని గ్రేడ్–1, 5 కార్యదర్శులకు ఆరు రోజుల పాటు నిర్వహించిన రెసిడెన్సియల్ శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ఆదివారం పాల్గొన్నారు. గ్రామాల్లో కొత్తగా లేఅవుట్ల ఏర్పాటుపై అమలులో ఉన్న నిబంధనలను పంచాయతీ కార్యదర్శులు పూర్తి స్థాయిలో తెలుసుకోవాలన్నారు. కొత్త లేఅవుట్‌ల ఏర్పాటు, పరిపాలన విధానం, హక్కులు, బాధ్యతలు, పంచాయతీ చట్టం, ఉపాధి హామీ పనులు, వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు, క్షేత్ర స్థాయిలో సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధన, ఉద్యోగుల విధి నిర్వహణకు సంబంధించి క్రమశిక్షణ చర్యలు తదితర అంశాలపై శిక్షణ ఇచ్చామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆరు రోజుల పాటు పంచాయతీ కార్యదర్శులు నేర్చుకున్న అంశాలపై రాత పరీక్ష నిర్వహించి వారి అభిప్రాయాలను సేకరించారు. జిల్లా నుంచి వంద మంది పంచాయతీ కార్యదర్శులు హాజరయ్యారు. అనంతరం కార్యదర్శులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సోమవారం నుంచి నాల్గో బ్యాచ్ పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ప్రారంభం అవుతుందని ప్రిన్సిపాల్ తెలిపారు. ఆ బ్యాచ్‌తో కాకినాడ జిల్లాలో పంచాయతీ కార్యదర్శుల శిక్షణ ముగుస్తుందన్నారు. ఫ్యాకల్టీలు శ్రీదేవి, బి.ఆంజనేయులు, వెంకటేశ్వరరావు, నిహారిక తదితరులు పాల్గొన్నారు.

విద్యాగణపతికి సామూహిక పూజలు



పిఠాపురంలో సామూహిక సరస్వతీ పూజలు చేస్తున్న విద్యార్థులు

పిఠాపురం: స్థానిక వేణుగోపాలస్వామి గుడి వీధిలో ఏర్పాటు చేసిన వినాయక మండపం వద్ద విద్యాగణపతికి ఆదివారం సామూహిక పూజలు నిర్వహించారు. విద్యార్థులతో అర్చకులు సామూహిక సరస్వతీ పూజలు చేయించారు. విద్యార్థులకు ఆలయ కమిటీ సభ్యులు పుస్తకాలు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

వినాయకునికి ప్రత్యేక పూజలు

కొత్తపల్లి: మండల వ్యాప్తంగా గణపతి నవరాత్ర ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాలు, మండపాల వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.



గోర్సలో స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు